International Journal of Academic Research
ISSN: 2348-7666 : Vol.2, Issue-4(7), October-December, 2015
Impact Factor: 3.075 Email: drtvramana@yahoo.co.in

# జ్ఞాపకాల పుటల్లో దసరా పాట

Dr.Naballa Bhanusree, Lecturer in Telugu, Meena ketan Degree college Gurandi Dt, Gajapati, ODISA, 761210

ప్రతి జాతి పండగల ఆచార వ్యవహారాలు ఆ జాతి సంస్కృతికి అద్దంపడతాయి. తెలుగువారు జరుపుకునే ఎన్నో రమణీయ పండుగలలో దసరా ఒకటి ప్రతి యేటా ఆశ్వీయుజ బహుల పాడ్యమి నుండి నవమి వరకు దసరా నవరాత్రులు పేరట జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాలలో దుర్గాష్టమి, నవమి, విజయ దశమికి అధికంగా పాధాన్యమిస్తారు. ఓవైపు శక్తి స్వరూపిణి అయిన దుర్గాదేవిని పూజించడం, మరోవైపు విజయ దశమినాడు సరస్వతీ పూజ చేయడం సంప్రదాయంగా వస్తుంది. విద్యార్ధుల్లో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతులు నింపాలనే ముఖ్యోద్దేశమే ఈ సరస్వతీ పూజ లక్ష్యం. దసరానాడు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిపిల్లలను వారివారి ఇళ్ళకు తీసుకువెళ్లి వివిధ రకాలైన దసరా పాటలు పాడించే ఆచారం ఉండేది. ఇంటికి వచ్చిన గురువులను తగిన రీతిలో సత్కరించడం, తోటి పిల్లలకు తాయిలాలివ్వడం అతిధి దేవుళ్ళ సత్కారానికి ప్రతిరూపమే. దసరా శుభ సందర్భంలో ఉపాధ్యాయులు పిల్లలకు మంచి మాటలతో కూడిన 'దసరా పదాలు నేర్పించి వారివారి ఇంటిముందు పాడిస్తుండేవారు. ఈ పాటలు పిల్లలకు కావలసిన భాషా సంస్కృతుల గూర్చిన పరిజ్ఞానాన్నిస్తాయి ఇప్పటి విద్యావ్యవస్థలో ఆ విధానమంతా జ్ఞాపకాల పుటలకే పరిమితమైంది.

దసరానాడు కొత్తబట్టలతో ముస్తాబై వెరుగు ధనస్సు పట్టుకొని వీధుల్లో తిరిగేవారు. వెదురుతో చేయబడిన విల్లు దాని నారి (పురితాడు) బాణం ఎప్పుడూ ఎక్కువపెట్టే స్థితిలో అలంకరింపబడి ఉంటుంది. బాణం చివర చిన్న తూణీరాకృతి కలిగిన అట్టతో చేయబడిన బుట్ట ఉంటుంది. ధనస్సు రంగురంగుల కాగితాలు అంటించబడి చూడముచ్చటగా ఉంటుంది. ముందురోజే ఏరి తెచ్చుకున్నతంగేడు, బంతి, చామంతి పూలు పత్రి మొదలైనవి బాణం చివరగల శంఖాకారపు బుట్టలో పెట్టి దసరా పాటలు పాడుతూ ఆ ఇంటి యజమానికి శుభం కలిగేలా పూల ఝల్లులు ధనస్సుతో కురిపిస్తారు. ఇదంతా చూడ్డానికి కన్నులపండుగగా ఉంటుంది. పిల్లలు పాడే పాటలు దేవతా పరమైనవి, పురాణేతిహాస చారిత్రిక జానపద రీతుల్లో ఉంటూ మారుతున్న కాలానికి ప్రాంతానికి అనుగుణంగా ఉంటాయి. చివరిలో దీవెనపాట, యజమాని ఆలస్యం చేస్తే ఆక్షేపణ పాట పాడిస్తూ ఆనందిస్తారు. గ్రామాల్లో ఈ విద్యార్థులు ముందుగా దేవాలయం వద్ద పాడటం తరువాత గ్రామ పెద్ద ఇంటిముందు తరువాత ఏ విద్యార్ధి ఇంటిముందు ఆ విద్యార్ధి పాడటం ఆనవాయితీ. ఇది ఆనాటి ప్రోటోకాల్ విధానానాకి నిదర్శనం.

దసరానాడు పిల్లలు పాడిన పాటలు పరిశీలిస్తే అనేక విషయాలు సుబోధితాలౌతాయి. మహాభారతంలో బృహన్నల రూపంలో అర్జునుడు ఉత్తర మొదలైన రాజకుమార్తెలకు సంగీత నాట్యాది విద్యలు నేర్పడం పూర్తయిన తర్వాత వారి వారి ప్రావీణ్యతను వారి పెద్దల ముందు ప్రదర్శించారట అందుకు ప్రతిఫలముగా వారు ఎన్నో బహుమానాలు బృహన్నలకు ఇచ్చారని ఆ సాంప్రదాయానుసారం తరతరాలుగా పిల్లలు తమ ఇళ్ళకు వెళ్లిపాడడమనే సాంప్రదాయం ఏర్పడిందంటారు. దసరా పాటలు, పద్య, ద్విపద, రగడ రూపాల్లో ఉంటూ అంత్యప్రాస అలంకారాలలో అలరారుతుంటాయి.

లభించిన మేరకు దసరా పాటలు ప్రధానంగా 1. దేవతాపరమైనవి. 2. చరిత్ర పరమైనవి, 3. సినిమా సంబంధమైనవిగా విభజించవచ్చు.

భారతదేశం పురాణేతిహాసాలకు పుట్టినిల్లు, పిల్లలు దసరానాడు పాడుకునే పాటలలో పురాణేతిహాస ఘట్టాలు, కథలు, వ్యక్తులను గూర్చిన వివరాలు ఉన్నాయి. పురాణ పురుషులలో అన్ని దేవతల కంటే అగ్ర పూజ్యుడు, విఘ్నాలు తొలగించేవాడయిన విఘ్నేశ్వరుని కీర్తించేది క్రింది పాట.

"శ్రీ విఘ్నరాజాయ శివకుమారాయ
గరుడ కిన్నెర వినుత కమనీయ చరిత"
"శ్రీగణాధీశాయ శివకుమారాయ
నాగముఖతుండాయ నాగభూషాయ"

"మూషిక వాహన ముందుగా గొలిచెద
దోషము లెడబాపి లేచి రక్షించురా"

తరువాత సరస్వతీ దేవికి సంబంధించిన పాట ఆలపిస్తారు.

"వాణి వీణాపాణి ప్రమథగీర్వాణి
పరమేష్టి రాణి ఓ పరమ కళ్యాణి"
"సరస్వతీ సతిమాకు చాలంగ నిమ్ము
పరమేష్టి రాణి మము పాలించవమ్మ"
"బ్రహ్మ పట్టపురాణి భారతీ జగదాంబ
ఇమ్మహిలో నన్ను యింపులో బ్రోవుమా"

భాషా స్థాయి కఠినంగా ఉంటూ సరస్వతి ప్రార్ధనవలె పై పాటలు ఉన్నాయి. వివిధ దేవతా సంబంధమైన దసరా పాటలు కూడా గమనించతగినవి.

"శ్రీలలో వెలసిన శ్రీ లక్ష్మివమ్మా – పాల సముద్రాన ప్రబలితివి కొమ్మ చెన్నకేశవరాణి చెలువమాయమ్మ" (లక్ష్మీదేవి పరంగా) "శరణు పల్లవ పాణి శరణు పూబోణి శరణు ముద్దల గుమ్మ శరణు మాయమ్మ" (పార్వతీదేవి పరంగా) "శ్రీగౌరి హృదయేశ శ్రీ నీలకంఠ గంగా జటాజూటకాల విధ్వంశ"ఈశపరమేశ్వర పాపసంహార నాగభూషణ ధీర నంది ఫణిహార" (శివుని పరంగా) "శ్రీ మహాదేవమ్మ వెలిగితివమ్మ అంబ జగదాంబ నినులోకులు స్తుతియింప" (కనకదుర్గ పరంగా) "అంజనీగర్భమందమర జన్మించి రాజిల్లి కాకుత్సరాముని భజియించి" (హనుమంతుని పరంగా) "మరుజనక మమ్మేలు మత్స్యావతార గురుతుగా కృప జూడ కూర్మావతార" (దశావతారాలు పరంగా) "ఏడుకొండలవాడా ఓ వేంకటేశ తిరుపతి కొండపై వరలుచున్నవ" (వేంకటేశ్వరుని పరంగా) "భానుండు మాకిచ్చు భవ్య సంపదలు కరుణతో చంద్రుండు కాంతి మాకిచ్చు" (సూర్యచంద్రగ్రహాలు పరంగా) మొదలైనవి ఉదాహరణలు.

కేవలం వ్యక్తిగత స్తుతి దేవతాస్తుతి పాటలే కాకుండా రామాయణ, భారత, భాగవతాది విషయాలకు సంబంధించిన పాటలు కూడా దసరా పాటలలో ఉంటాయి.

"మహిషాసురుడను మాయ రాక్షసుడు
దీక్షతో బ్రహ్మకై తపము నొనరించె"

అంటూ దుష్టసంహారం చేసిన దుర్గాదేవిని కీర్తిస్తూ బాలలను ఎల్లవేళలో రక్షించమనే అభ్యర్ధన పాటయిది. రామాయణానికి చెందిన

"ఇలలోనయోధ్య యనుగలదొక్కపురము
దశరధుండను రాజు యశముతో నేలె" అన్నే 32 వరుసల పాట ఉంది.

ఇది రామాయణంలోని ప్రముఖ ఘట్టాలన్ని తెలియపరుస్తుంది. భాగవతంలోని రుక్మిణీ కళ్యాణ ఘట్టంచక్కని పాటగా చెప్పబడి దసరా పాటలలో చోటుచేసుకుంది.

"శ్రీమించు నైమిశంబున శౌనకాది
పరమ ఋషులకు సూతపౌరాణికుండు
ముదముతో జెప్పినముని పుంగవుండు
శుకయోగి రుక్మిణి శౌరి పరిణయము
మును పరీక్షితునకు మోదంబుతోను"

భాగవతం దశమ స్కందంలోని శ్రీకృష్ణుని చేష్టలన్నీ "అలివేణి వినవే ఆశ్చర్యమొకటి, జలజాక్షలందరు జలకమాడ" అనే దసరా పాటలో ఉన్నాయి. గోపికలు కట్టిన రకారకాల చీరలు గూర్చిన వివరాలు గోపికా వస్త్రాపహరణ ఘట్టం మొదలైన వివరాలు ఇందులో వివరించబడ్డాయి. "వసుధలో శ్రీకృష్ణ వనమాలి వినుమ" పాటలో కృష్ణుని బాల్యక్రీడలు గూర్చి, గోపికలు యశోదతో మొరపెట్టుకోవడంఇవన్నీ "ఏమిరా శ్రీకృష్ణ యింతయాగడము, తగునటర ఇది నీకు జగతిలోపలను" అనే దసరా పాటలలో ఉన్నాయి.

దసరా పాటలలో రెండవ రకం చారిత్రిక పరమైనవి 200 వరుసలుగల సుదీర్ఘమైనది క్రింది సారంగధర చరిత్రపాట

"శ్రీ మహారాజ నరేంద్రపురవరము
అకలంకముగనేలె ఆ నరేంద్రునకు
ముద్దుల సతియగు ముదిత రత్నాంగి"

ఈ పాటలో సారంగధర జననం అతని పావురం పినతల్లి మేడకు వెళ్లడం, చిత్రాంగి మోహించడం, తండ్రి శిక్షించడం వంటి ఘట్టాలన్నీ వర్ణించబడ్డాయి.

విద్యార్థులకు చారిత్రక పరిజ్ఞానమే కాక దేశభక్తి కూడా ఉండాలన్న భావన దసరా పాటలలో కనిపిస్తుంది.

"శ్రీభారతాంబ ఓ అంబ జగదాంబ ధరలోన నీ మహిమ తరమె ఎన్నగను రత్న గర్భవు నీవు రత్నాల ప్రోవు నవ్యతేజము నిచ్చి నడిపించు ధరణి"

అనే పాటలో భారతదేశాన్ని శక్తి స్వరూపిణిగా వర్ణిస్తూ గాంధీ ప్రసక్తి, స్వాతంత్ర్యోద్యమ విషయాలన్నీ చెప్పబడ్డాయి.

దసరా పాటలలో చారిత్రికమైన విషయాలు, ప్రాంతీయాభిమానాలు, వినోదాలకు సంబంధించిన పాటలు చోటు చేసుకోవడం విశేషం. పూర్వకాలంలో సంస్థానాధిసులకు ధనవంతులకు వినోదాల మీద మక్కువ అధికంగా ఉండేది. అందులో భాగంగా కోడిపందేలు,పొట్టేలు పందేలు గుర్రపు పందేలు ఎడ్ల బండ్ల పందేలు పెట్టించి ఆనందించేవారు. బ్రిటీషువారి కాలంలో వచ్చిన రైలుబండితో గుర్రాలకు పరుగుపందెంపెట్టించి తమ ఘనత చాటుకునే వాళ్ళు కొన్నిసార్లు గుర్రాలు గెలిచేవి, మరికొన్ని సార్లు ఓడేవి. ఏది ఏమైనా ఈ క్రింది రైలుబండి దసరాపాట గమనించతగ్గది.

"జగతిలో వినరయ్య జాతి దొరతనము
నీతిగాలోకముల ఖ్యాతి నిలుపుటకు
మేల్‌బండి పొగబండి రైలు బండినడిపి"

విజయనగరం శ్రీ పూసపాటి మహారాజు అందరి రాజులను పిలింపిచడం తమ ఖ్యాతి విస్తరించాలనే ఉద్దేశ్యంతో గుర్రం రైలు బండి పరుగుపందెం ఏర్పాటు చేయడం గుర్రం అలంకరణ గుర్రం పరుగు విన్యాసాలు, గెలుపు చెన్నపట్నం దొరలు సిగ్గుపడడం గూర్చి చెప్పబడ్డాయి.

దసరా పాటలు కంఠస్తం చేసి ఆలపించడం విషయంలో పెద్దవారికి చిన్న వారికి తేడాలుంటాయి. బాలలకు సంబంధించిన చిన్నచిన్న దసరా పద్యాలు కూడా ఉన్నాయి.

"సీతమ్మ వాకిట సిరిమల్లె చెట్టు, చెట్టు కదలాకుండా పూలుకోయండి"

"అల్లంత దూరాన అద్దాలమేడ, అద్దాల మేడలో ముద్దురామన్న" "నరసన్నపేటలో బాగోతులాట రాజు కూర్చొన్నది రతనాలపీట" లాంటి చిన్నచిన్న పాటలు కంఠస్తం చేయడానికి సులభంగా ఉంటుంది. "ఈగ – సాలెపురుగు" "చిలకమ్మ పెళ్ళి" లాంటి పాటలు కూడా ఉన్నాయి.

"కాదేది దసరా పాటకనర్హం" అన్నట్లు దసరా పాటలలో వెండితెర వెలుగుల గుబాలింపు కూడా ఉంటుంది. సంస్కృతి విజ్ఞాన పురోగమనాల కారణంగా సినిమాలు ప్రజాదరణ పొందాయి. అందులో పాత్రలకు కథానాయకులకు అభిమాన సంఘాలు ఏర్పడుతున్నాయి. ఆ ప్రభావం దసరా పాటలపై పడక తప్పలేదనిపిస్తుంది.

"జయ సినీ దేవతా జయమమ్మనీకు
శ్రీరంజనీ నిన్ను చిత్తమున దలతు
సావిత్రి అంజలి సాయపడరమ్మ"

అంటూ సాగిన పాటలో నాటి సినిమా కథానాయకుల పెర్లన్నీ చెప్పబడ్డాయి. రంగుపూలతో తరతరాల తనివితీరగ తెరపైన కనిపించే దేవతలని, సోకుచేసుకునే స్త్రీలు అందరికీ ఆదర్శప్రాయాలని చెప్పబడింది. సినిమాల పేర్లుతో కూర్చిన క్రింది దసరా పద్యంలో

"ఓయమ్మ ఓ బొమ్మ ఓ ముద్దుగుమ్మ
చిత్రాలు చిత్రాలు చెప్పెదను వినుమ
బహువింతలో యమ్మ బైస్కోపులమ్మ
అల్లిబిల్లి కథలు కలికాలమమ్మా
బాలరాజు రత్నమాలలున్నారు
శతదినోత్సవములే చేయించినారు"

ప్రేమలేఖ, పక్కింటి అమ్మాయి, మొదలైన 28 సినిమాల పేర్లు కూర్చబడ్డాయి.

విద్యార్థులు తాము నేర్చుకున్న ఆయా పాటలు వాళ్ళ వాళ్ళ ఇంటిముందు ఆలపించి చివరిలో దీవెన పాట పాడుతారు. గ్రామాలలో ఉన్న వివిధ కులాల వారికి తగినట్లుగా ఈ పాటలు ఉంటాయి. యజమాని ఏమైనా ఆల్యంచేస్తే దానికి వేరేపాట ఉంటుంది. కొన్ని పాటలలో స్వార్థపూరితమైన మనస్తత్వాల గూర్చిన వ్యాజస్తుతి నిందలాంటి పాటలు కూడా ఉన్నాయి.

"వేదశాస్త్ర పురాణ – వేత్త బుధగణ్యం (బ్రాహ్మణుల దసరా పాట) "పెద్దకోమట్లులో – పేరు పడిసితివి, శోభాషు శీకును, జేయదగునయ్యా, కోటికి పడగెత్తు – కోమట్లతోను సాటి ఎవ్వరునీకు చక్కదనమెన్న" వైశ్యుల దసరాపాట, ధరకర్ణి భద్రయం నుదయించినారు కరణాలలోను తలకట్టుయినవారు" (కరణాల దసరాపాట) రాజాధిరాజువో రాజమార్తాండ వినవయ్య మా మనవి విన్నపంబొకటి (రాజుల దసరాపాట) మొదలైన పాటలు వివిధ కులాలను కీర్తించే పాటలు.

"ఏదయా మీదయా మా మీదలేదు
ఇంతసేపుంచుటా ఇది మీకు తగునా " అంటూ
చేతిలో లేదనక అప్పివ్వరనక
ఇరుగుపోరుగుల కెల్తె ఇస్తారు సుమ్మి
పావలా బేడిస్తే పట్టేదిలేదు
అర్ధరూపాయిస్తే అంటేది లేదు
ముప్పావలా ఇస్తే ముట్టేదిలేదు
పాత రూపాయిలు మాకు పడవండి

కొత్త రూపాయలు మాకు చెల్లుబడి
అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లవాళ్ళకు చాలు పప్పుబెల్లాలు
జయ జయ జయ జయ జయమహా విజయ

అంటూ పిల్లలు పాడుతుంటే చాలా ముచ్చటగా ఉంటుంది. పోతన నారాయణశతకంలోని "ధరసింహాసనమై పద్యం, "గిలక చేపట్టి కలకలముతోడ మిమ్ముదీవింపగా మేము వచ్చితిమి"

"ఘల్లుఘల్లున పసిడి గజ్జలను మ్రోయ శ్రీలక్ష్మి మీ ఇంట వచ్చినిల్చుండు" లాంటివి మరికొన్ని పాడి ఆశీర్వదిస్తారు. బాలవాక్కు బ్రహ్మావాక్కు అంటారు అందుకే కాబోలు

బంగారు జలతారు రంగైనపాగ" అంటూ యజమానిని మహారాజుతో పోల్చి అతని దయాగుణాన్ని సంస్కారాన్ని గుర్తుచేసుకునేటట్లు ఈ పాట ఉంటుంది. ప్రపంచంలో అందరూ దాతలు కారు కొందరు పిసినారులు కూడా ఉంటారు. మీరు అలాంటివారు కారని ఓ పిసినారి మనస్తత్వాన్ని తెలియపర్చేపాట.

"విసరయ్య బద్దమనుజుని పద్దతులను వినిపించెదము మీకు వినయంబుగాను" అనేది. ఓ పిసినారి బడిపిల్లలకు భయపడి దాక్కోడానికి పడే పాట్లు గూర్చి 95 వరుసలలో చెప్పబడింది.

దసరా పాటలలో తాటిచెట్టు కొబ్బరి చెట్టు పోటీ పాట "శ్రీపతి సన్నిధి చిత్తంబులోన కిన్నెరలు మీటి సంగీతంబు పాడ" అంటూ 300 వరుసలుగల పాటలు ఉన్నాయి. ప్రతి పాట చివరలో జయ జయా జయ జయా జయమహా విజయ అని, మరికొన్ని ప్రాంతాలలో "జయీభవ, జయ దిగ్విజియీభవ అని పాడుతుంటారు. దసరా ఇంకా నెలరోజులుందనగా గురువుగార్లు పిల్లలకు దసరా పాటలు రాసిచ్చి వారిచేత కంఠస్థం చేయించేవారు. పిల్లల తరగతి స్థాయిని కంఠస్థం పెట్టగలిగే సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ పాటలు రాసిచ్చేవారు. కొన్ని సుదీర్ఘమైన పాటలు కంఠస్తానికి కష్టంగా ఉంటే విభజించి ఇద్దరి ముగ్గురికి ఇచ్చేవారు. మారుతున్న రోజులు, విద్యావిధానాలవలన ఈ దసరా పాటలన్నీ కేవలం జ్ఞాపకాల పుటలకే పరిమితమౌతున్నాయి. ఈ నాటి పిల్లలకు వీటి గూర్చి ప్రశ్నిస్తే తెలీదన్న జవాబు వస్తుంది. నాలుగుపదులు దాటిన వయస్సు వాళ్ళకడిగితే ఆనాటి తమ జ్ఞాపకాలు ఆనందంతో ముచ్చటిస్తారు. ఆ ఆనందం తిరిగి రాదంటారు. ఏది ఏమైనా తెలుగు సాహితీ సంస్కృతులకు దసరాపాట ఓ గీటురాయి అనక తప్పదు.